సాక్షి తిరుపతి

బుధవారం, 9, అక్టోబర్, 2024



డోలాయనంలో 'సాగు'
కండలేరు జలాశయ ఆయకట్టు పరిధిలోని మూడు లక్షల ఎకరాల సాగు డోలాయనంలో పడింది. - IIలో



గరుడోత్సాహం!
తుమ్మలగుంటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. - IIలో



ప్రహరీ కూల్చారు!
టీడీపీకి ఓట్లు వేయలేదన్న కక్షతో పట్టాభూమిలోని ఇల్లుతోపాటు ప్రహరీని కూల్చేశారు. - IIలో

న్యూస్‌రీల్

డీఎస్సీ శిక్షణకు టెండర్ల ఆహ్వానం

తిరుపతి అర్బన్: సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టిన డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం ప్రముఖ ప్రైవేటు శిక్షణా సంస్థల నుంచి ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. రెసిడెన్షియల్ విధానంలో సుమారు 5,050 మంది ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీలో అత్యున్నత శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎమ్‌ప్యానల్ కోసం దరఖాస్తు చేసుకునే సంస్థలు కనీసం రెండు డీఎస్సీలకు కోచింగ్ ఇచ్చి ఉండి, వందకు పైగా అభ్యర్థులు ఆ కోచింగ్ సెంటర్ నుంచి ఉపాధ్యాయులుగా ఎంపికై ఉండాలని తెలిపారు. ఆసక్తిగల సంస్థలు ఈనెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. httpr:/tender.apepsocureme nt.gov.in వెబ్‌సైట్ నందు దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన సూచించారు.

14 నుంచి పంచాయతీ వారోత్సవాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఇతర అధికారులు

తిరుపతి అర్బన్: జిల్లాలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుపతి జిల్లా నుంచి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో భూమి పూజ చేయాల్సిన అన్ని పనులను గుర్తించామని తెలిపారు. ప్రతి పంచాయతీలో ప్రభుత్వ భవనాల కాంపౌండ్ వాల్స్, శ్మశాన వాటికలు, నాలెడ్జ్ బోర్డ్స్, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు గుర్తించి రూ.74 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఇంకా రూ.25 కోట్లు మంజూరు చేయాల్సి ఉందన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 24 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 81,481 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 38,762 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.31 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

గరుడ గమనం.. భక్తజన పునీతం!



గరుడ వాహనంపై మలయప్ప వైభవం

మోహినీ అవతారంలో స్వామివారు

వెన్నముద్ద చేతబట్టిన చిన్నికృష్ణుడు

గరుడ వాహన సేవకు తరలి వచ్చిన అశేష భక్తజనం

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన గరుడ వాహన సేవకు భక్తులు పోటెత్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం సాయంత్రం తనకు అత్యంత ప్రీతి పాత్రమైన గరుడ వాహనాన్ని అధిరోహించి తిరుమాడ వీధుల్లో దేదీప్యంగా ఊరేగుతున్న దివ్యతేజోమూర్తిని దర్శించి పులకించి పోయారు. గోవిందనామస్మరణతో తమకిష్ట దైవాన్ని ప్రార్థిస్తూ.. హారతులు పడుతూ.. భక్తులు తన్మయత్వం చెందారు. సాంస్కృతిక నీరాజనంతో కళాకారులు విశేషంగా ఆకట్టుకున్నారు. ఉదయం మోహినీ అవతారంలో శ్రీనివాసుడు భక్తకోటిని అనుగ్రహించారు.

అంగరంగ వైభవంగా శ్రీవారి గరుడ సేవ

- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఈఓ, అదనపు ఈఓ

తిరుమల: తిరుమల శ్రీవారు తనకిష్టమైన గరుడ వాహనాన్ని అధిరోహించి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. మంగళవారం రాత్రి 6.30 గంటలకే గరుడ వాహన సేవ ప్రారంభమైంది. ఉత్సవమూర్తిని ప్రతి భక్తుడూ దర్శించుకునేలా వాహనాన్ని అటూ ఇటూ తిప్పుతూ ముందుకు కదిలించారు. కూడళ్లలో ఎక్కువ సమయం వాహనాన్ని నిలిపి సాధ్యమైనంత ఎక్కువ మంది భక్తులకు దర్శనం కల్పించడంలో టీటీడీ ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి, ఎస్పీ సుబ్బరాయుడు సఫలీకృతులయ్యారు. ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

ఉదయం నుంచే నిరీక్షణ

గరుడ సేవను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం 4 గంటలకే గ్యాలరీలన్నీ కిక్కిరిసిపోయాయి. ఆలయ వీధుల్లో 2 లక్షల మంది కూర్చునే అవకాశం ఉంది. వాహనసేవ ప్రారంభమయ్యే వాహన మండపం సమీపానికి, భక్తులు కూర్చునే బ్యారికేడ్లలోకి ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి అనుమతించారు.

భక్తులందరికీ అన్నప్రసాదాలు

గ్యాలరీల్లో వేచి ఉన్న భక్తులకు జలప్రసాదంతోపాటు, పులిహోర, ఉప్మా, సాంబారన్నం, ఇతర అన్నప్రసాదాల ప్యాకెట్లు, పాలు, తేనీరు సరఫరా చేశారు.





సాంస్కృతిక నీరాజనం




గరుడ వాహనం..భక్తజన పరవశం



కళాత్మకం!



చిన్నికృష్ణుడు..చిలిపి కృష్ణుడు!



ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి

భద్రత కట్టుదిట్టం



భక్తులను ఎక్కడికక్కడ నిలువరిస్తున్న పోలీసులు

తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు స్వయంగా బందోబస్తును పర్యవేక్షించారు. ఈసారి మొత్తం 6,145 మంది పోలీసు సిబ్బందిని ఆలయ నాలుగు మాడవీధులు, ట్రాఫిక్ మళ్లింపు ప్రాంతాల్లో మోహరించారు. ముందు జాగ్రత్త చర్యగా బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో పాటు క్విక్ రియాక్షన్‌టీంలను రంగంలోకి దించారు. వందలాది మంది పోలీసులు మఫ్టీలో నిఘా వేశారు. 10 పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్‌లో నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షిస్తూ నిఘాను పటిష్టం చేశారు. తిరుమల భద్రత కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆక్టోపస్ కమాండో సిబ్బంది కూడా అప్రమత్తం చేశారు.

జగన్నాటక సమ్మోహనం

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం ఉదయం జగద్రక్షకుడైన శ్రీ వేంకటేశ్వరుడు మోహినీ రూపంలో దంత పల్లకీపై శృంగార రసాధి దేవతగా, పక్కనే వెన్న ముద్ద చేత బట్టిన చిన్నికష్ణుడితో కలసి హొయలొలుకుతూ భక్తకోటిని సాక్షాత్కరించారు. ఉదయం భానుడి ప్రతాపం ఎక్కువగా ఉన్నప్పటికీ భక్తులు ఎండలోనే నిరీక్షించి స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు స్వర్ణరథం

బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజు బుధవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు శ్రీనివాసుడు స్వర్ణ రథాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహించనున్నారు.

నకిలీల బెడద.. రైతులకు గుండె దడ!



కురింజల్లంలో మొలకెత్తని వరి నారుమడి

వరదయ్యపాళెంలో వరి వంగడాల దందా

- రైతులను నిలువునా ముంచేసిన ప్రైవేట్ వ్యాపారులు
- నారుపోసి పది రోజులైనా మొలకెత్తని గింజలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వ్యవసాయశాఖ
- ఆందోళనలో అన్నదాతలు

వరదయ్యపాళెం: జిల్లాలోని తూర్పు మండలాలైన వరదయ్యపాళెం, బీఎన్ కండ్రిగ, సత్యవేడు ప్రాంతాల రైతులు నకిలీ వరి విత్తనాలతో నిలువునా మోసపోతున్నారు. ప్రైవేటు విత్తన విక్రయ వ్యాపారులు నకిలీ విత్తనాలను అంటగట్టి అమాయక రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ప్రస్తుత రబీ సీజన్ నేపథ్యంలో వరదయ్యపాళెం మండలంలోని పలువురు రైతులు నారు మడులు పోసి పది రోజులైనా విత్తనాలు మొలకెత్తకపోవడంతో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో మునిగిపోయారు. ఈ విషయమై సంబంధిత దుకాణదారులకు, వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బిల్లులు ఇవ్వకనే అధిక ధరలకు విక్రయాలు

ప్రైవేటు విత్తన విక్రయ దుకాణదారులు రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, పురుగు మందులకు కనీసం బిల్లులు కూడా ఇవ్వడంలేదు. దుకాణాల వద్ద సూచిక బోర్డులు సైతం ఏర్పాటు చేయలేదు. ఎంఆర్‌పీ కంటే రూ.20 నుంచి రూ.30 అధికంగా దోపిడీ చేస్తున్నారు.

మామూళ్ల మత్తులో వ్యవసాయశాఖ

ప్రైవేటు విత్తన విక్రయ దుకాణాలపై ప్రత్యేక నిఘా ఉంచాల్సిన వ్యవసాయశాఖ నెలవారి మామూళ్ల మత్తులో జోగుతున్నట్టు తెలుస్తోంది. మొలకెత్తని విత్తనాలు, ప్రభుత్వ నిషేధిత పురుగు మందులు విక్రయించి రైతులను దోపిడీ చేస్తున్నా సంబంధిత అధికారులు తమకేమీపట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. మండలంలో గతంలోనూ నకిలీ విత్తనాల విక్రయాలు, అధిక ధరలకు విక్రయం వంటి ఘటనలు జరిగినా నియంత్రించనందువల్లే మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయి.

మొలకెత్తని ఎంటీయూ-12కి 71 రకం



మొలకెత్తని నారుమడులను పరిశీలిస్తున్న ఏడీఏ సుబ్రమణ్యం

వరదయ్యపాళెం మండలంలో ప్రస్తుత రబీ సీజన్‌కు 7 వేల ఎకరాలలో వరి సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. అయితే ఎంటీయూ-12కి 71 రకం విత్తనాలు పలుచోట్ల వారం రోజులు పూర్తయినా మొలకెత్తలేదని రైతులు చెబుతున్నారు. మండలంలోని కురింజల్లం, సీఎల్ఎన్‌పల్లి, కదూరు, నెల్లటూరు, తాగేలి, అరుదూరు, పెద్ద పాండూరు, తొండంబట్టు ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉన్నట్టు బాధిత రైతుల ఆరోపిస్తున్నారు. ఈ మేరకు మండల వ్యవసాయ అధికారులకు ఫిర్యాదులు సైతం అందాయి.

నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాలు ఇవే

వరదయ్యపాళెం, చిన్న పాండూరు ప్రాంతంలో ప్రైవేటు విత్తన విక్రయ దుకాణాలు ఉన్నాయి. మండలంలో 7 ప్రైవేటు దుకాణాలు ఉండగా అందులో వరదయ్యపాళెంలోని వేంకటేశ్వర ఫర్టిలైజర్స్, శ్రీనివాస ఫర్టిలైజర్స్ దుకాణాల్లో కొనుగోలు చేసిన ఎంటీయూ-12కి 71 రకం, బీపీటీ రకం విత్తనాలు మొలకెత్తలేదని బాధిత రైతులు వాపోతున్నారు. ఈ విషయమై సంబంధిత దుకాణ యజమానులకు తెలియజేసినా స్పందించడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

రైతుకు వెన్నుదన్నుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం


గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసింది. గ్రామ స్థాయిలో ఎరువులు, పురుగు మందులు రైతు భరోసా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచింది. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభమైనా ఆ దిశగా అడుగులు పడలేదు. అంతేగాక నకిలీ విత్తనాల నియంత్రణకు నియోజకవర్గానికి ఓ అగ్రి ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం వాటి వినియోగం దాదాపుగా పక్కన పెట్టేసింది. దీంతో ప్రైవేటు వ్యాపారుల అక్రమాలకు రెక్కలొచ్చాయి.

విత్తనాలు మొలకెత్త లేదు




నేను రెండెకరాల వరి పంట సాగుకోసం వరదయ్యపాళెంలోని ఓ ప్రైవేటు దుకాణంలో 20 కిలోల బస్తా రూ.950 చొప్పున 3 బస్తాలు కొనుగోలు చేశాను. అయితే నారుమడి పోసి వారం రోజులైనా విత్తనాలు మొలకెత్తలేదు. సంబంధిత దుకాణందారుడిని ప్రశ్నించినా ఏమాత్రం స్పందన లేదు. రెండో పర్యాయం శ్రీకాళహస్తిలో కొనుగోలు చేసి నారుమడిని సిద్ధం చేసుకున్నా.
– రఘురామయ్య, రైతు, కురింజల్లం

లైసెన్సులు రద్దు చేయాలి



నకిలీ విత్తనాలను విక్రయించే దుకాణాలకు లైసెన్సులను తక్షణమే రద్దు చేయాలి. రైతులకు నష్టం జరిగే చర్యలు చేపట్టే యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. దీనిపై ప్రభుత్వం,వ్యవసాయశాఖ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. తక్షణమే విజిలెన్స్ అధికారులు మండలంలో దుకాణాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టి నకిలీ విత్తనాలపై నిగ్గుతేల్చాలి. – భాస్కర్‌రెడ్డి, రైతు విభాగం నాయకుడు, పెద్ద పాండూరు

చర్యలు తీసుకుంటాం



నకిలీ విత్తనాల విషయమై ఇప్పటికే మండలంలోని రైతుల నుంచి మాకు ఫిర్యాదులు అందాయి. ఆ మేరకు కురింజల్లం, మరికొన్ని గ్రామాల్లో మొలకెత్తని నారు మడులను పరిశీలించాం. నష్టపోయిన రైతులకు మరోమారు విత్తనాలను పంపిణీ చేయాల్సిందిగా దుకాణదారులను ఆదేశించాం. పూర్తి స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – సుబ్రమణ్యం, ఏడీఏ, సత్యవేడు వ్యవసాయశాఖ డివిజన్

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుదాం!



సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు, తిరుపతి జిల్లాల పార్టీ అధ్యక్షులు, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేద్దాం
- పార్టీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు
- ఉమ్మడి చిత్తూరు జిల్లా నియోజకవర్గ నేతలతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి

తిరుపతి మంగళం: కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుదామని మాజీ మంత్రి, చిత్తూరు, తిరుపతి జిల్లాల పార్టీ అధ్యక్షులు, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పీఎల్‌ఆర్ కన్వెన్షన్‌లో మంగళవారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీ, సమన్వయకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ ప్రజాసంక్షేమం, పేదల అభ్యున్నతి కోసం అవతరించిన పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. పేదల పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కంకణబద్ధులై శ్రమిద్దామన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీకి వెన్నుదండుగా ఉంటూ పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్న నాయకులకు, కార్యకర్తలకు వివిధ పదవులను ఇచ్చి తగిన గుర్తింపు కల్పిద్దామని చెప్పారు. పార్టీకి పట్టుగొమ్మలు కార్యకర్తలేనన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అలాగే కూటమి ప్రభుత్వం చేపట్టే ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలకు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయడం లేదన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ అధికార దాహంతో నోటికొచ్చిన అబద్ధపు హామీలు ఇవ్వడం, అధికారంలోకి రావడం చంద్రబాబు నైజమని ఎద్దేవా చేశారు. ప్రజలకు అందిస్తామన్న సంక్షేమ పథకాలను చంద్రబాబు అమలు చేయకపోతే వైఎస్సార్‌సీపీ రోడ్లపైకి వచ్చి ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యేలు వెంకటేగౌడ్, డాక్టర్ సునీల్, నియోజకవర్గాల సమన్వకర్తలు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, విజయానందరెడ్డి, రాజేష్, కృపారాణి పాల్గొన్నారు.

మద్యం షాపుల దరఖాస్తులకు నేటితో ఆఖరు

- ఇప్పటివరకు 1,413 దరఖాస్తులు

తిరుపతి క్రైమ్: మద్యం కొత్త పాలసీకి సంబంధించి బుధవారం సాయంత్రం ఐదు గంటలకు దరఖాస్తుల గడువు ముగియనుంది. అనంతరం ఈనెల 11 తేదీ ఉదయం 8 గంటల నుంచి తిరుచానూరు శిల్పారామంలో లాటరీ పద్ధతిలో కలెక్టర్ వెంకటేశ్వర్ నేతృత్వంలో దుకాణాల ఎంపిక చేపట్టనున్నారు. 12వ తేదీ నుంచి దుకాణాలు పొందినవారు షాపులు నిర్వహించుకోవచ్చు. జిల్లాలో 227 దుకాణాలకు గాను ఇప్పటివరకు 1,413 దరఖాస్తులు వచ్చినట్టు సంబంధిత అధికారులు వెల్లడించారు. తిరుపతి, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో పోటీ ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాలు ఈనెల 11వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

క్లుప్తంగా

మహిళలకు బ్యూటీ పార్లర్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో 15వ తేదీ (సోమవారం) నుంచి 30 రోజుల పాటు మహిళలకు బ్యూటీ పార్లర్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ పి.సురేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు అర్హులని తెలిపారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలని సూచించారు. శిక్షణ సమయంలో సిబ్బందికి ఉచిత భోజనం , రానుపోను ఒక్కసారి చార్జీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289, 83091 64644 సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుల గడువు పెంపు

తిరుపతి ఎడ్యుకేషన్ : జాతీయ స్థాయిలో డిసెంబర్ 8వ తేదీన నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకు గడువును పెంచినట్లు డీఈఓ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. ''డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీఓవీ.ఇన్'' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పరీక్షకు జిల్లాలోని అన్ని యాజమాన్య ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, వార్షికాదాయం రూ.3.5 లక్షలలో ఉన్న వారు అర్హులన్నారు. ఈ పరీక్షకు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుమును ఆన్‌లైన్‌లో ఇచ్చిన ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా చెల్లించాలని చెప్పారు. దరఖాస్తు పూర్తయిన తరువాత ప్రింటెడ్ నామినల్ రోల్స్, ఎస్‌బీఐ కలెక్ట్ రసీదును డీఈఓ కార్యాలయంలో ఈ నెల 17వ తేదీ లోపు సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లోనూ, అలాగే డీఈఓ కార్యాలయంలో సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

గరుడోత్సాహం!

గరుడునిపై కల్యాణ వెంకన్న అభయం

- ఆరు గంటల పాటు సాగిన గరుడసేవ
- గోవింద నామస్మరణతో తరించిన భక్తజనం
- 75 వేల మందికిపైగా దర్శించుకున్నట్లు అంచనా
- పల్లకీపై మోహినీ అవతారంలో విష్ణుమూర్తి తేజసం
- తిరుపతి ఇస్కాన్ ఆలయం నుంచి పట్టువస్త్రాల సమర్పణ





గరుడ సేవకు పోటెత్తిన భక్తులు(ఇన్‌సెట్) గరుడ వాహనంపై ఊరేగుతున్న కల్యాణ వెంకన్న

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో అతిముఖ్యమైన గరుడవాహన సేవ మంగళవారం రాత్రి అశేష భక్తజనం మధ్య శోభాయమానంగా సాగింది. వేలాది మంది భక్తులు తరలిరావడంతో తుమ్మలగుంట వీధులన్నీ జనసంద్రమయ్యాయి. భక్తుల సౌకర్యార్థం సాయంత్రం 6 గంటల నుంచే స్వామి వారి గరుడవాహన సేవ ఊరేగింపుగా బయలుదేరినప్పటికీ అర్ధరాత్రి 12 గటల వరకు వాహన సేవ జరిగింది. కూడళ్లలో భక్తులు హారతి ఇచ్చేందుకు బారులు తీరడంతో అందరికీ సంతృప్తికరమైన దర్శనం కలిగించేలా ఏర్పాట్లు చేశారు. గరుడ వాహన సేవలో తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కాగా మంగళవారం ఉదయం విష్ణుమూర్తి మోహినీ అవతారంలో పల్లకీపై ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు.

సారె సమర్పణ

గరుడ వాహన సేవను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం ఇస్కాన్ ఆలయం అధ్యక్షులు రేవతి రమణదాస్ ప్రభు పట్టు వస్త్రాలు సమర్పించారు. అలాగే తిరుపతి రూరల్ మండలం, మల్లంగుంట, సి.గొల్లపల్లి, దుర్గసముద్రం గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున సారె తీసుకువచ్చి స్వామి వారికి సమర్పించారు. అనంతరం స్వామి వారి పల్లకీ ఉత్సవంలో పాల్గొన్నారు. అలాగే సాయంత్రం గరుడవాహన సేవకు తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లి, రామచంద్రాపురం మండలం కుప్పం బాదూరు, నెత్తకుప్పం డివిజన్ల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు సారెను తీసుకువచ్చి స్వామి వారికి సమర్పించారు. సారె తీసుకువచ్చిన భక్తులందరికీ ఆలయ ధర్మకర్త చెవిరెడ్డి, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆత్మీయ స్వాగతం పలికారు.

గొడుగులు, వస్త్రం సమర్పణ

తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట గ్రామానికి చెందిన చెంచురెడ్డి గరుడ వాహన సేవకు సంబంధించిన కొత్త గొడుగులు, శేష వస్త్రాన్ని స్వామి వారికి సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి నూతన గొడుగులు, వస్త్రాలకు ప్రత్యేక పూజలు చేసిన తర్వాత మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ సాదరంగా ఆలయం వద్దకు ఆహ్వానించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గరుడవాహన సేవలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కోలాటాలు, చెక్క భజనలు, కీలుగుర్రాలు, పిల్లనగ్రోవులు, కేరళ వాయిద్యాలతో పాటు భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు, దేవతా మూర్తుల కళారూపాలతో భక్తులను ఆకట్టుకున్నారు.



మోహినీ అవతారంలో కల్యాణ వెంకన్న కటాక్షం



గరుడ వాహన సేవలో మాజీ ఎమ్మెల్యేలు భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

భూ ఆక్రమణపై ఫిర్యాదు

- రెవెన్యూ, పోలీస్‌లను అడ్డుకున్న కూటమి నేతలు



కూటమి నేతల ఆక్రమణలో కంచె వేసిన గ్రామ కంఠం భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ, పోలీస్

భాకరాపేట: మండలంలోని తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీ, కమ్మపల్లె గ్రామం వద్ద ఉన్న గ్రామ కంఠం భూమి ఆక్రమించి కంచె వేశారని కూటమి నేతలు సోమవారం ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు. మంగళవారం మధ్యాహ్నం రెవెన్యూ, పోలీసు అధికారులు గ్రామ కంఠం భూమిని పరిశీలించారు. తిప్పిరెడ్డిగారిపల్లె రెవెన్యూ గ్రామం, కమ్మపల్లె గ్రామానికి ఆనుకొని ఉన్న సర్వే నం .76లో పూరా విస్తీర్ణం 1.56 సెంట్లు ఉంది. అందులో ఇదే పంచాయతీ, యడమవారిపల్లెలో జాతీయ రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఇండ్లు ఇచ్చేందుకు గత ప్రభుత్వంలో కమ్మపల్లె గ్రామకంఠం భూమిలో 24 ప్లాట్లు వేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అది ఆగిపోయింది. ఇండ్ల ప్లాట్లు వేసిన భూమి పోను మిగిలిన భూమిని కూటమి నేతలు ఆక్రమించి కంచె వేశారు. ఈ విషయంగా మరో వర్గం కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారులు కంచె తీసివేయడానికి ప్రయత్నించగా ఆక్రమణదారులు అడ్డుకున్నారు. ఎన్నో ఎళ్లుగా తమ అనుభవంలో ఉండే భూమికే కంచె వేసుకున్నామని చెప్పారు. దీంతో రికార్డులు ఉంటే చూపించాలని అధికారులు కోరారు. గ్రామ కంఠం భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని రోడ్డు విస్తర్ణలో ఇళ్లు కోల్పోయిన వారికి, ఇళ్లులేని పేదలకు ఇంటి స్థలాలను ఇవ్వాలని కూటమి నేతలు కోరారు. ఆక్రమణకు పాల్పడ్డ గ్రామస్థులు ఎమ్మెల్యే నాని ద్వారా చెప్పిస్తాం.. అప్పటి వరకు కంచె తొలగించొద్దని చెప్పడంతో రెవెన్యూ, పోలీసు అధికారులు వెనుదిరిగారు. మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, ఎఎస్‌ఐ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

> **ప్రభుత్వ భూములను పరిరక్షిస్తాం**
>
> ప్రభుత్వ భూముల్లోకి ఎవరు ప్రవేశించినా కఠిన చర్యలు తప్పవు. కమ్మపల్లె గ్రామ కంఠం భూమిని స్వాధీనం చేసుకుంటాం. ఇళ్లు లేని పేదలకు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటాం.
>
> – జనార్దనరాజు, తహసీల్దార్, చిన్నగొట్టిగల్లు

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు

ఏర్పేడు: హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్టు రేణిగుంట డీఎస్పీ వై.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రేణిగుంట మండలం, అత్తూరు పంచాయతీ పరిధి మొలగమూడి ఎస్సీ కాలనీకి చెందిన మొలగమూడి ప్రవీణ్(35) శుక్రవారం రాత్రి హత్యకు గురైనట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో ఏర్పేడు సీఐ జయచంద్రకు అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో రేణిగుంట మండలంలోని జీపాళెం క్రాస్ రోడ్డు వద్ద అనుమానా స్పదంగా ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడిందన్నారు. మృతుడు మొలగమూడి ప్రవీణ్, మండలంలోని పెన్నగడం ఎస్సీ కాలనీకి చెందిన మొలగమూడి దినేష్ కుమార్ అలియాస్ దినేష్(20) కుటుంబాల మధ్య గత కొంతకాలంగా మనస్పర్థలున్నాయని తెలిపారు. దినేష్ రేణిగుంట మండలం, కుర్రకాల్వ ఎస్సీ కాలనీలోని స్నేహితుడు గుండూరు లోకేష్(20)తో ప్రవీణ్‌ను హతమార్చడానికి నిర్ణయించుకున్నాడని వెల్లడించారు. ఈ క్రమంలో లోకేష్, దినేష్, ప్రవీణ్ ఈ నెల 4న పాపానాయుడుపేటలో మద్యం సేవించారన్నారు. శుక్రవారం సాయంత్రం ముగ్గురూ కలిసి ద్విచక్ర వాహనంపై మండలంలోని రావిళ్లవారికండ్రిగ ఎరికలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలోని మామిడి తోటలోకి వెళ్లారని తెలిపారు. పథకం ప్రకారం తమవెంట తెచ్చుకున్న మచ్చు కత్తితో విచక్షణారహితంగా ప్రవీణ్‌పై ఇద్దరూ దాడి చేసి మెడ, గొంతు, ఛాతీపై నరికి హత్య చేశారన్నారు. ఆపై దినేష్, లోకేష్ అక్కడి నుంచి మృతుడి ద్విచక్ర వాహనంపై పారిపోయినట్లు చెప్పారు. ప్రవీణ్ హత్యకు ఉపయోగించిన మచ్చు కత్తి, సెల్‌ఫోన్‌ను రహస్య ప్రదేశంలో ఉంచారన్నారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్టు చెప్పారు. నాలుగు రోజుల్లో కేసును ఛేదించిన ఏర్పేడు సీఐ జయచంద్ర, సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించి రివార్డులు ప్రకటించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

టీడీపీకి ఓట్లు వేయలేదని.. ప్రహరీ కూల్చివేత



ప్రహరీని జేసీబీతో కూల్చేస్తున్న అధికారులు

సూళ్లూరుపేట రూరల్: టీడీపీకి ఓట్లు వేయలేదని పట్టాభూమిలోని ఇల్లుతోపాటు ప్రహరీ గోడను పచ్చనేతలు కూల్చేశారు. మండలంలో టీడీపీ నాయకుల దౌర్జన్యం రోజు రోజుకూ పెచ్చుమీరుతోంది. చిన్నస్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సామాన్యులపై పచ్చనేతల ఝులుం ప్రదర్శిస్తున్నారు. మండలంలోని పెరిమిటిపాడు గ్రామానికి చెందిన మల్లి రమేష్ అనే వ్యక్తి సర్వే నంబర్ 87-2లో సమారు 14.5 అంకణాల్లో ప్రహరి గోడతో పాటు ఇల్లు నిర్మించుకున్నాడు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేయలేదని ఆ పార్టీ నాయకులు కొందరు రెవెన్యూ, పోలీసు, పంచాయతీ కార్యదర్శి, ఈఓపీఆర్‌డీతో కలసి అక్రమంగా మల్లి రమేష్ ఇల్లు, ప్రహరీ గోడ రోడ్డుకు అనుకుని ఉందని దౌర్జన్యంగా కూల్చేశారు. అడిగేవారు ఎవరూ లేకపోవడంతో టీడీపీ నాయకులు ఈ దారుణానికి దిగారు. తన ఇల్లు, ప్రహరీ సహా పట్టా భూమిలో ఉందని బాధితులు అధికారులకు తెలిపినా పట్టించుకోకుండా ఉద్దేశపూర్వకంగా గోడను కూల్చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాదికారులు స్పందించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సూపర్ సిక్స్‌కు ఇంకా ఎంతకాలం?



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

గూడూరు రూరల్: రాష్ట్రంలో సూపర్ సిక్స్ హామీ అమలుకు ఇంకా ఎంత కాలం పడుతుందని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు ప్రశ్నించారు. పట్టణంలోని షాదీ మంజిల్‌లో వ్యవసాయ కార్మిక సంఘం తిరుపతి జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జిల్లా కార్యదర్శి సీహెచ్ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోటేశ్వరరావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు కూటమి ప్రభుత్వం పలు రకాల హామీలను గుప్పించిందని, అయితే నేటికీ అవి అమలుకు నోచుకోకపోవడం దారుణమన్నారు. జిల్లాలో గూడూరు, వెంకటగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి ప్రాంతాలలో పేదల భూములు పెద్దల కబంధహస్తాలలో ఉన్నాయని, వీటిని వెంటనే పేదలకు దక్కేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఉపాధ్యక్షులు కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇది ముంచే ప్రభుత్వం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డి

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధ్వజం

వాకాడు: ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని, మంచి ప్రభుత్వం పేరుతో డప్పు కొడుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇది మంచి ప్రభుత్వం కాదని.. ముంచే ప్రభుత్వమని ఆయన విరుచుకుపడ్డారు. మంగళవారం వాకాడులోని తన నివాసంలో వాకాడు, కోట, చిట్టమూరు మండలాల నాయకులతో కలసి ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే కూటమి ప్రభుత్వం పాలనా పరంగా విఫలమైందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చకుండా కాలయాపనం చేస్తోందని ధ్వజమెత్తారు. ఉచిత ఇసుక పేరుతో కూటమి నాయకులు దోపిడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. వాస్తవానికి గత ప్రభుత్వం కంటే ఇప్పుడు అధిక ధరలతో ఇసుకను సరఫరా చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు ఇవ్వాల్సిన పథకాలు నిలిపేసి ఇది మంచి ప్రభుత్వం అనడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. నాయకులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, చిట్టి బాబురెడ్డి, ఏనుగు సుధాకర్‌నాయుడు, దువ్వూరు భార్గవ్‌రామ, నెల్లూరు పెంచలరెడ్డి, శేషురెడ్డి, రవి, వెంకటయ్య పాల్గొన్నారు.

డోలాయమానంలో సాగు!

ఉమ్మడి నెల్లూరు, తిరుపతి జిల్లాలకు అందని కండలేరు జలాలు

- చెరువులన్నీ ఖాళీ
- ప్రశ్నార్థకంగా రబీసాగు
- ఎండుతున్న నిమ్మ, అంతర్ పంటలు
- అయోమయంలో అన్నదాతలు

సైదాపురం: ఎటు చూసినా బీళ్లు. నెర్రెలు బారిన చెరువులు.. బోసిపోయిన కాలువలు.. దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు.. ఇదీ ఉమ్మడి నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో రైతన్నల పరిస్థితి. కండలేరు జలాశయంలో 25 టీఎంసీల నీరు ఉన్నా కనీసం ఖరీఫ్‌లో ఆఖరి దశలో ఉన్న పంటలకూ నీరందని దుస్థితి. ఈ నెలాఖరులో రబీ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏం చేయాలో దిక్కుతోచని స్థితి. కండలేరు జలాశయం నుంచి రెండు జిల్లాల రైతులకు చుక్క నీరు విడుదల చేయకపోవడంతో వేలాది ఎకరాల నిమ్మతోటలు, అంతర పంటలు ఎండుముఖం పట్టాయి. చెంతనే నీరున్నా ఫలితం లేకుండా పోతోందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

కండలేరు, సోమశిలలో పుష్కలంగా నీరు


కనీవిని ఎరుగని రీతిలో ఆగస్టులోనే కండలేరు డెడ్ స్టోరేజీకి చేరింది. అయితే సోమశిల జాలాశయం నుంచి వరదనీరు వచ్చి చేరుతుండడంతో అక్టోబర్ మొదటి వారంలో కండలేరు 25.872 టీఎంసీలకు పెరిగింది. ఈ నెలాఖరుకు కండలేరులో 45 టీఎంసీలు చేరే అవకాశం ఉంది. అలాగే శ్రీశైలం ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లు పుణ్యమా అని సోమశిల జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగింది. జాలాశయంలో ప్రస్తుతం 54 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. దీనికితోడు వరదల కారణంగా ఇన్‌ఫ్లో పెరుగుతోంది. రోజూ సోమశిల జాలాశయం నుంచి కండలేరుకు 9.650 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

వట్టిపోయిన చెరువులు

కండలేరు జలాశయం పరిధిలో సుమారు మూడు లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. గత ఖరీఫ్‌లో సర్వేపల్లి, వెంకటగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు నియోజకవర్గాలకు చెందిన రైతులకు కండలేరు జలాశయం నుంచి చుక్కనీరు అందకపోవడంతో అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. ప్రస్తుతం కండలేరుకు నీరు పెరుగుతున్నా కాలువలకు చుక్కనీరు వదలకపోవడంతో చెరువులన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి.



చెన్నైకి నీటిని విడుదల చేసిన దృశ్యం



కండలేరు జలాశయం నుంచి చెన్నైకి విడుదల చేసిన నీరు

చెన్నైకి నీటి విడుదల

కండలేరు నుంచి చెన్నై తాగునీటి అవసరాలకు రోజూ 1,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మరో 500 క్యూసెక్కుల నీటిని పెంచేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఇలా ఏటా కండలేరు జలాశయం నుంచి చెన్నైకి 12 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఈ క్రమంలో సత్యసాయి గంగ కాలువ జలకళ సంతరించుకుంది. తద్వారా ఈ ప్రాంత రైతులకు కూడా గంగ బ్రాంచి కెనాల్స్ ద్వారా నీటిని విడుదల చేస్తారనే ఆశతో రైతులున్నారు.

గతంలో మూడు పంటలకూ నీరు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా నిలిచింది. తెలుగు గంగ ద్వారా రైతులకు మూడు పంటలకూ నీరందించింది. అయితే కూటమి ప్రభుత్వం సాగును కాలికొదిలేసింది. ఫలితంగా అయోమయ పరిస్థితి నెలకొంది.





నీళ్లులేక ఎండిన నిమ్మ చెట్లు

> **నీటి కోసం తిప్పలు**
>
> ఈ ఏడాది సాగునీటి కోసం పడరానిపాట్లు పడుతున్నాం. కండలేరు జలాశయం నుంచి కైవల్యా నదికి ప్రతి ఏటా నీటిని విడుదల చేసేవారు. ఆ నీటి ఆధారంగా పంటలను సాగు చేసుకునేవాళ్లం. కానీ నేడు అందుకు భిన్నంగా నీటిని విడుదల చేయలేదు. సాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. – బీ.శివకుమార్ ,సైదాపురం